# యాదృచ్ఛికం

## తరణి రాజకుమార్

చీకటి పడలేదింకా.

అలాగని పూర్తిగా వెలుగు ఆవహించిలేదు. సరిగ్గా ఆ సంధ్యవేళలో ఓ ఆకారం కదిలింది. కదలడమంటే పడివడిగా అడుగులేస్తూ ఒడలు మరచిపోయేట్లు నడవడం కాదు. అడుగులో అడుగేస్తూ ఆయాసపడుతూ పెదాల అంచులకంటా నాలుక నాడిస్తూ నెమరేస్తూ మధ్యమధ్యలో తన వునికిని జనానికి తెలియబర్చడానికి పెద్దగా కాండ్రించి. ఊస్తూ ఇకిలిస్తూ సకిలిస్తూ నడవడమన్న మాట.

నిజం చెప్పాలంటే ఆ ఆకారం హెడ్ కానిస్టేబుల్ వెంకటస్వామిది. అందరిలా మీరూనూ అతడి వాలకం చూసి ముక్కుమీద వేలేసుకుని నోళ్ళు వెళ్ళబెట్టి సున్నాలు చుట్టనవసరం లేదు. ఎందుకంటే వెంకటస్వామి ఎర్రగా నవనవలాడ్తూ అందంగా వుండడుమరి. సరిగ్గా చెప్పాలంటే అచ్చం పందిలా... అంటే సీమపంది కాదు సుమా!.... అసలైన సిసలైన నాటుపందిలా నల్లగ నిగనిగలాడుతూ పెద్ద పొట్టను ముందేసుకుని ఏదో మోయలేని బరువును మోస్తున్నట్లు గునాగునా నడుస్తూ అందర్నీ ఆశ్చర్యపరచడం అతడి హాబీల్లో ఒకటి.

ఇంతకీ నిజం చెప్పొచ్చేదేమంటే ఈ భారీ కాయం ఈ చానాళ్ళ మ్యాడ్రోజులే అయింది. అందుకని ఇక్కడి వాళ్ళెవరూ అతడి గురించి అంతగా ఎరుగరు మరి. పైగా మఫ్టీలో ఉన్నాడాయే. వెంకటస్వామి బయోగ్రఫీ తిరగేస్తే ఎంత చిత్రంగా వుంటుంది. డ్యూటీలో వుంటే ఠంచనుగా అటెన్షను భంగిమలో స్టేషన్‌లో వుంటాడు. అప్పుడెంత నాలుక పీకేసినా, నరాలు లాగేసినా చుక్కజోలికి వస్తే పోదు. సివ్వియారిటీలోనూ, సీనియార్టీలోనూ అతడిదే పైచేయి. అందుకే అధికార్లు అతడి అభ్యర్థన మన్నించి బదిలీ చేశారతడ్ని.

ఇప్పుడు మఫ్టీలో వున్నాడు కాబట్టి మనిషికి బ్రేకుల్లేవు. రేసుగుర్రంలా తెగ హుషారుగా ఖుషీగా వున్నాడు. అంతటి భారీ మనిషి కళ్ళతో నిప్పులు చెరిగేస్తూ దేగలా చూసేయగల్డు. ఎలుగ్గొడ్డులా నవ్వేయగల్డు. మరి ఆ మనిషే రివర్సులో అందితే జుట్టు, అవసరానికి కాళ్ళు, ఒళ్ళు... ఇంకా ఇంకా ఏమైనా పట్టేయగల్డు.

నాటుసారా గొంతునిండా పోసుకుని బుగ్గలుబ్బేట్లు జర్దాపాన్ బిగించి ఒళ్ళు విరుస్తూ ఛాతీ వైశాల్యం ప్రదర్శిస్తూ నడుస్తూంటే జనాలంతా ముఖాల్లో క్వశ్చన్ మార్కు లేసుకుని నిలబడి అంతలోనే తమకుతామే ఏదో ఒక ఆన్సరు చెప్పేసుకుని చెదిరిపోతున్నారు.

ఎందుకంటే ఆ సైడంతా 'బిజినెస్'కు పెట్టింది పేరు. రంగురంగు కాగితాలు గుప్పించాలేగానీ రవిక కోకల్దగ్గర్నుంచి షిఫాన్, ఆర్గండి శారీస్ వరకూ అందుబాటులో ఉంటాయి. అయితే ప్రతి సరుక్కీ ఓ రేటుంటదది. రంగుకాగితాల పరిమాణాలబట్టి రామచిలుకలూ, సీతా'కోక' చిలుకలూ రెక్కలు కట్టుకు వాల్తాయి బట్టలి ప్పేసుకుంటూ...

వెంకటస్వామి నడుస్తున్నాడు...

అతడి దృష్టంతా మరోలా వుంది. అతడు బయల్దేరేది వేశ్యల కౌగిళ్ళలో కరిగిపోవడానికి కాదు, నలిగిపోవడానికి కాదు. వాళ్లనుపట్టుకోడానికి అసలీ వూరొచ్చింది వచ్చివెడీ అందుకే మరి.

ఆ మధ్య పేపర్లో ఎక్కడో చదివాడు. అందరూ భారంగా శ్వాసవదిలి ఓ నిట్టూర్పు విడిస్తే కనీసం మదర్‌కంట్రీ చెడిపోతుందని వెంకటస్వామి రవ్వంత కంగారు కూడా పళ్ళేదు.

ఆ రాత్రంతా ఆలోచనలన్నీ ముందేసుకుని నిద్రరాకుండా మందేసుకుని కూర్చున్నాడు. రాత్రివేళల్లో రోడ్లమీద పబ్లిక్‌గా జరిగే ఈ వ్యభిచారంవల్ల కొద్దో గొప్పో లాభం వుండొచ్చు. సహజంగా ఏ పోలీసూ నిద్ర మానుకుని నిశాచరుడిలా వూరి చివరికెళ్ళి బీటువేయడు. అటువంటిది తను రంగంలోకి వురికితే వాళ్ల రంగు బయట పెట్టేయొచ్చు. తన శక్తి సామర్థ్యాలమీద తనకంత గాఢమైన నమ్మకంవుంది. అదిలించో బెదిరించో లంజల్దగ్గరి నుంచి పదో పరకో గుంజొచ్చు ఆన్ ది స్పాట్‌లో... ఇక లారీలు, టాక్సీలు సరేసరి!... ఓహ్! చేతినిండా నోట్లే!...

తనకొచ్చిన బంగారంలాంటి ఆలోచనకు మురిసి మూర్ఛబోయి కనుపించని దేవుడికి మొక్కులు మొక్కేశాడు సీరియస్‌గా. అప్పట్నుంచి తన ఆలోచన్ని అమలు పెట్టేవరకూ కునుకు పట్టలేదు. 'దొరల' కాళ్ళావేళ్ళాపడి అనుకున్నది సాధించాడు. ది గ్రేట్ వెంకటస్వామి!...

ఈ ఆలోచన రావడంతో నడుస్తున్న వెంకటస్వామి నిండుగా నవ్వుకున్నాడు. అతడి పైపెదాన్ని కప్పేసిన దట్టమైన మీసానికి రవ్వంత ఠీవి వచ్చి ఒంపులు తిరిగింది.

ఇంతలో వెనుక ఎవరో దగ్గినట్లనిపించింది.

వెనక్కి తిరగాలనుకున్నాడు గానీ ఆ ప్రయత్నాన్ని మానుకున్నాడు. అంతటి భారీకాయాన్ని వెనక్కి తిప్పడానికి అతడి మనసు సుతారామూ అంగీకరించక గునిసింది.

ఆ నవ్విన శాల్తీ ఒక్క ఉదుటున ముందుకు వచ్చి పళ్ళన్నీ కనిపించేట్లు మరో నవ్వు వెకిలిగా విసిరి నమస్కారం పారేశాడు. వెంకటస్వామికి పరిస్థితి పూర్తిగా అర్థమయింది. ఇటువంటి బ్రోకరుగాళ్ళని తన సర్వీసులో ఎంతమందినో చూశాడు. అయితే తన ముఖంలో ఏ భావమూ బయుపటపడనీయక ముభావంగా వున్నాడు.

"సార్" చిన్నగ పిలిచేడు.

"ఊ!"

"బెజవాడ్నుంచి వచ్చిందండీ! భలే నైసుగా ఉంటుందండీ... పేరు పద్మ... తరోమారు రుచి చూడాల." చేతులు నలుపుకుంటున్నాడు.

తెల్లటి ప్యాంటు అదే రంగు ఫుల్‌హ్యాండ్ షర్టులో పెరిగిన గడ్డంతో జుగుప్స కలిగించేట్లున్నాడు. గాలికే పడేట్లు సన్నగా పీలగావున్నా అతడి మాటల్లో చమత్కారమూ, ఆకర్షణా మించి ఏదో చవరుంది.

"ఇంకా..." వెంకటస్వామి పెదాలు కదిలాయి. తనను అతడు గుర్తు పట్టనందుకు మనసులో సంతోషించి రహస్యంగా నవ్వుకున్నాడు. అతడు కాస్త చొరవ తీసుకుని గొంతు సవరించుకున్నాడు. అతడికే ఆనందంగా వుంది ఒక బేరం తగిలినందుకు.

"రాజమండ్రి పిల్లండీ!... పర్సనాలిటీ ఫైనూ...." నసిగాడు.

నడుస్తున్న వాడల్లా వెంకటస్వామి ఆగి జేబులు తడుముకుని చుట్ట బయటకు తీసి మునిపంటితో చివర్లు కొరికి పళ్ళమధ్య బిగిస్తే అతడు తన జేబులోంచి అగ్గిపెట్టె తీసి వెలిగించి ఆనందపడ్డాడు. గుప్పుగుప్పుమంటూ రెండుసార్లు పీల్చి కాండ్రించి ప్రక్కకు వూశాడు వెంకటస్వామి.

అప్పటికే చాలా దూరమొచ్చారు ఇద్దరూను.

పైన నక్షత్రాలు మెరుస్తున్నాయి. కేవలం ఆ వెలుగు మినహా మరే ఆసరాలేదు. చిక్కని చీకట్లో కనిపించడంలేదు. అయితే వెంకటస్వామికి ఇటువంటి రైడింగులు అలవాటే. అతడి కళ్ళల్లోవున్న రాడ్స్, కోన్స్ కణాలు చీకటికి అలవాటైపోయాయి.


వెంకటస్వామి నడుస్తూంటే ప్రక్కనున్న శాల్తీ జోరీగలా గొడవపెడ్తూ అమ్మాయిల అందచందాలను పొగుడుతూ గజ్జికుక్కలా కాళ్ళకడ్డం పడ్తూన్నాడు. విసుగ్గా, విరగ్గా ముఖం పెట్టేడు వెంకటస్వామి. ఒక్కసారిగా వాడిమీద పడి గొంతును నులిమి

> ఆ నవ్విన శాల్తీ ఒక్క ఉదుటున ముందుకు వచ్చి పళ్ళన్నీ కనిపించేట్లు మరో నవ్వు వెకిలిగా విసిరి నమస్కారం పారేసాడు. వెంకటస్వామికి పరిస్థితి పూర్తిగా అర్థమైంది. యిటువంటి బ్రోకరుగాళ్ళని ఎంతమందినో చూసాడు.

చంపేయాలన్నంత కోపం వచ్చింది. అయినా తమాయించుకున్నాడు. రాబోయే 'ప్రమోషన్' దృష్టిలో వుంచుకుని. అతడి తెంపరితనానికి, తెగింపుకు మనసులో ముచ్చటపడ్డాడు కూడా. తన కమిషన్ పైసలుకోసం అతడు పడే బాధ చూస్తే నిజంగా జాలేసింది.

ఓ ఫర్లాంగు నడిచాక రోడ్డు ప్రక్కనున్న గుడిసెలోంచి పెట్రమాక్స్‌లైటు తాలూకు వెలుతురు కనిపించింది. నిజానికది స్టేజీకాదు. అయినా అక్కడ జనం చాలామంది మూగివున్నారు. ఎవరికివారు జంటలు జంటలుగా తలా ఒక దిశకేసి పోతున్నారు చీకటిని చీల్చుకుంటూ.

నెమ్మదిగా వెళ్ళి ఓ బెంచిమీద కూర్చున్నారిద్దరూ.






ఇంకా ప్రక్కన బ్రోకరుగాడు వసపిట్టలా వాగుతూనే వున్నాడు.

ఇంతలో ఎవడో హోటల్ కుర్రాడు కాబోలు 'టీ' తీసుకొచ్చి ముందుంచాడు. గ్లాసందుకుంటూ నొసలు చిట్లించి పరిసరాల్ని గమనిస్తూ తల పంకించాడు వెంకటస్వామి.

పేరుకది హోటల్ కానీ కల్లు సారాయి దగ్గర్నుంచి కాల్చుకుతినే మాంసం ముక్కల వరకూ లభిస్తాయి.

ఇంతలో ఏదో పాట తాలూకు మూలుగు మూలుగుతూ లోపలికి వచ్చింది ఓ అమ్మాయి. కాకతాళీయంగా ఆమెకేసి దృష్టి సారించాడు వెంకటస్వామి. ఆ గడసరి చిన్నగానవ్వి కన్ను మీటింది.

వెంకటస్వామి కంగు తిన్నాడు.

ఆమె అందం గురించి మనసులో ప్రశంసించకుండా వుండలేకపోయాడు.

ఆమె మళ్ళీ కిసుక్కున నవ్వి వెంకటస్వామిని అయోమయంలో పడేసింది.

అది గమనించిన బ్రోకరుగాడు మరీ దగ్గరగా జరిగి చెవిలో ఏదో చెప్పాడు. "కేరళ గుంటండీ!... మన భాష రాదు. మొగుడితో పోరి మనాంధ్రా వచ్చేసింది"

వెంకటస్వామికి అతడి మాటలు వినిపించడంలేదు అనే కంటే చెవులు పనిచేయడం మానేసాయి అనడం సబబేమో!

ఆమె నవ్వినపుడు కంటిముందు మెరుపుతీగె మెరిసినట్లనిపిస్తోంది. ఆమె కొబ్బరి ముక్కల్లాంటి బుగ్గలకేసి 'ఆకలి'గా చూశాడు. ఆ పిల్ల తన బలిసిన పిక్కలు కనిపించేట్లు సిల్కు లంగాను పైకి కట్టుక్కూర్చుంది. కుంకుమపొడి కలరు ఓణీలో మెరిసిపోతోంది. వెంకటస్వామి పూర్తి మైకంలో మునిగిపోయాడు. అతడి కళ్ళు ఆమె జాకెట్లోని 'బరువుల్ని' తూకంవేస్తూ అంచనాలు చేస్తున్నాయి.

ఆమె అతడి పరిస్థితి గమనించి చిన్నగ నవ్వి లేచింది.

బిస్కట్ కోసం ఎగబడే బొచ్చుకుక్కలా ఆమెను అనుసరించాడు వెంకటస్వామి... ఆకాశంలో నక్షత్రాలు మినుకుమినుకు మంటున్నాయి. మబ్బులచాటునున్న చంద్రుడు మసగ్గా కనిపిస్తున్నాడు.

ఆమె నడుస్తూంటే నాభిచుట్టూ వున్న ముడతలు ఆమె అనుభవాన్ని ఎలుగెత్తి చెప్పుతున్నాయి. ఆమెకేసి తమకంగా చూసి చేయందుకున్నాడు వనువుగా.

సరిగ్గా ఆ సమయంలో హఠాత్తుగా అర్ధాంగి నాంచారమ్మ గుర్తొచ్చింది. ఒక్కసారిగా భార్యమీద ఎక్కడలేని కోపమొచ్చింది.

స్వర్గమంటే ఇక్కడే!... సుఖమంటే ఇక్కడే!

నాంచారమ్మలో ఆ తళుకుబెళుకు లెక్కడివీ!

ప్రేమించడమంటే తనకసలు తెలీదు. అసలు ఆడమగల మధ్య ఈ ప్రేమలు, అనురాగాలు ఎలా పుడతాయో ఎరుగడు.

కారణం!... తను నల్లగ వుంటాడు. తనను ఎవరూ ప్రేమించరు. అందరిలా ఫ్యాను క్రింద కూర్చుని కాగితాల మీద ఇంగ్లీషు గీతలు గీసే వుద్యోగం కాదు తనది. తన వుద్యోగానికి పగలు, రాత్రి ప్రమేయం లేదు. ఎండకుఎండి, వానకు తడిసేది ఒక్క పోలీసు ఉద్యోగినేనేమో! తనకు పెళ్ళన్నారు. ఓ పసుపుతాడిచ్చి కట్టమంటే కట్టాడు. అంతే!... ఆ తర్వాత అహర్నిశలూ ఈ డ్యూటీకి అంకితమైపోయాడు. నిద్రకూ, సుఖానికీ దూరమై యాంత్రిక జీవితానికి అలవాటుపడ్డాడు.

కేరళ పిల్ల సుతారంగా చూపుడువేలితో వెంకటస్వామి బుగ్గపై మీటగా అతడి ఆలోచనలు చెదిరిపోయాయి.

ప్రక్కనున్న గడ్డివాము ప్రక్కన చేరారు ఇద్దరూ. వెంకటస్వామి కనురెప్పలు కైపుతో నిండి బరువుగా వున్నాయి. ఆమె కుంకుమపాడి కలరు వోణి అందుకుని అరటితొక్కను విసిరేసినట్లు విసిరేశాడు. ఆమెను దగ్గరగా లాక్కుని ఒళ్ళంతా తడిమి ముద్దుచేశాడు. ఆమెను కౌగలించుకున్నప్పుడు ఆమె చెవిజూకాలు అతడి చెంపలపై కదులుతూంటే చక్కలిగింతలు పెట్టినట్లు ఫీలయ్యాడు.

అంతే!... అంతలో ఓ బరువైన చేయి అతడి భుజంపై పడింది. విసురుగా తలత్రిప్పి చూశాడు. ఎదురుగా లాఠీకర్రను ఝుళిపిస్తూ ఇద్దరు పోలీసులు నిలబడ్డారు.

"రేయ్!... ఎవర్రా నువ్వు!... నడు స్టేషన్‌కు" కర్కశంగా వచ్చాయి ఆ మాటలు. నల్లగ తుంగమొద్దుల్లా వుండి వికృతంగా నవ్వుతున్నారిద్దరూనూ.

ఇంతలో మరొకడు చేయి పట్టుకున్నాడు.

'ఇదేమిటి? ఇలా జరిగింది...' ఆశ్చర్యపోయాడు వెంకటస్వామి. అతడు ఆలోచించడానికి కూడా వ్యవధిలేదు. పైగా అతడి బుర్ర కూడా పనిచేయడం మానేసింది.

తనూ కానిస్టేబులే. అయితే మఫ్టీలో వున్నాడు. తను రైడింగ్‌కు వచ్చాడని చెబితే నమ్మరు. నవ్వుతారు. పైగా తనను అరెస్టుచేసి ప్రమోషన్ కొట్టేస్తారు.

"ఏయ్!... ఏమిటాలోచిస్తున్నావ్!" గద్దించాడు హెడ్ కానిస్టేబుల్.

"అబ్బెబ్బె..." నసిగాడు వెంకటస్వామి. అంతకుమించి నోటమాట పెగల్లేదు. బహుశా వీళ్ళు క్రొత్తవాళ్ళయి వుండాలి. కొత్తవాళ్ళ పాలోపడి బయటపడాలి. తను అసలే మ్యాట్రోజులే అవడంతో ఇంకా ఎవరితోనూ పరిచయాలు పెట్టుకోలేదు.

ఇంతలో మరో కానిస్టేబుల్ ప్రక్కకు లాగాడు.

"హెడ్డుగారు మరీ ఉగ్రరాముడయ్యా!... నువ్వింకా కొత్తవాడిలా వున్నావ్. అంతో ఇంతో కొట్టి బయటపడవయ్యా..." సలహా ఇచ్చాడు. లంచం!... అంటే లంచం ఇచ్చి బయటపడాలా! ఛీఛీ...! అవమానం!... తను కానిస్టేబుల్ అయివుండీ మరో కానిస్టేబుల్‌కే లంచం! పగవాడికెక్కడా వుండొద్దు ఇంతటి విపరీత పరిస్థితి...

జేబులు తడుముకున్నాడు. జీవితకాలం శిక్ష వేసిన ఖైదీలా అడుగున కూర్చుంది మనీపర్సు.

అంతే!... మనీపర్సు బయటకు రావడమూ, చేతులు మారడమూ క్షణంలో జరిగాయి.

తన నెల జీతం పోయిందని నీరసంగా అడుగులో అడుగేస్తూ నడుస్తూంటే వెనకనవ్వులు వినిపించాయి.

వ్యభిచారులందరికీ తెలుసు పోలీసులెవరో!

ప్రతి పోలీసుకూ తెలీదు వేశ్యలెవరో విటులెవరో బ్రోకర్లెవరో!

ఆ నగ్నసత్యం తెలిసి వెంకటస్వామి చీకటిలో కలిసిపోతూ పూరుముఖం పట్టాడు.